https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 | సంచిక:28 | పేజీలు :02 | వెల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | ఆదివారం, సెప్టెంబర్ 13,2026





### చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరిస్థితిని చూసి..

# బ్రిక్స్ ప్రసంగాన్ని ఆపిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

దేశ రాజధాని ఢిల్లీలో శనివారం నిర్వహించిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరిస్థితిని గమనించిన మోదీ కొంత ఆందోళన చెందారు. తన ప్రసంగాన్ని అకస్మాత్తుగా నిలిపివేశారు. 'అంతా బాగానే ఉన్నదా?' అని జిన్‌పింగ్ అనువాదకుడిని మోదీ అడిగారు. (దీ=×జూ ాబఎఎఙ) వెంటనే ఎలాంటి స్పందన రాకపోవడంతో అదే ప్రశ్నను పునరావృతం చేశారు. అంతా సవ్యంగానే ఉందని సూచిస్తూ జిన్‌పింగ్ తల ఊపారు. దీంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని తిరిగి ప్రారంభించారు. అయితే ఈ సంఘటన వెనుక కారణం ఏమిటన్నది స్పష్టంగా తెలియలేదు. ఈ అంతరాయం కొన్ని క్షణాలే కొనసాగినప్పటికీ బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న అందరి దృష్టిని ఇది ఆకర్షించింది. కాగా, ఏడేళ్ల తర్వాత తొలిసారి భారత్‌ను సందర్శించిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అనంతరం ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరుకాలేదు. సుదీర్ఘ ప్రయాణం, బిజీ షెడ్యూల్ కారణంగా చైనా అధ్యక్షుడు అలసిపోవడం వల్ల విందుకు గైర్హాజరైనట్లు తెలుస్తున్నది. అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ కూడా ఈ విందులో పాల్గొనలేదు.

# బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్ ప్రసంగం..

## ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని సూచన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13



బ్రిక్స్ సదస్సు రెండో రోజైన ఆదివారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సంబంధాలు బలపడాలని ఆకాంక్షించారు. ఇదే సమయంలో ఐదు కీలక సూత్రాలపై దృష్టిపెట్టాలని ప్రతిపాదించారు. ఢిల్లీ, భారత్ మండపంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిన్‌పింగ్ మాట్లాడారు. గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ ఓపెన్ సోర్స్ కమ్యూనిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ విషయంలో చైనానే బాధ్యత తీసుకుంటుందన్నారు. తమ చర్య ద్వారా ఆయా దేశాల మధ్య ఏఐ అభివృద్ధి, బహుభాషా మోడళ్లకు చెందిన అప్లికేషన్లు ఏర్పాటు చేయడం, ఏఐ సెమినార్లు, శిక్షణ వంటివి నిర్వహిస్తామన్నారు. రెండోది బ్రిక్స్ దేశాల మధ్య స్పెషల్ ఎకనామిక్ జోన్ భాగస్వామ్యం అవసరం అన్నారు. దీని ద్వారా ఆయా దేశాల మధ్య పెట్టుబడులు, వ్యాపారం విషయంలో సహకారం పెరుగుతుందన్నారు. బ్రిక్స్ ఇంటెలిజెంట్ పోర్టల్ ఏర్పాటు చేసుకోవాలని, సహకారానికి పాలసీ రూపొందించాలని సూచించారు. అలాగే, బ్రిక్స్ దేశాల మధ్య డిజిటల్ ఎకో సిస్టమ్ కోసం క్లౌడ్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా డిజిటల్ ఎకానమీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డిజిటల్ స్కిల్స్‌లో శిక్షణ, సాంకేతిక మార్పిడి వంటివి జరగాలన్నారు. కాలానికి అనుగుణంగా స్మార్ట్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం తగిన ప్రమాణాలు, నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని వివరించారు. తయారీ రంగంలో ఇంటెలిజెన్స్‌ను ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని ఆయన సూచించారు. చివరగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో బ్రిక్స్ దేశాలు సంయుక్తంగా అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ రంగంలో ఇన్నవేషన్‌కు చైనా బ్రిక్స్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా బ్రిక్స్ దేశాలు పరస్పరం సహకరించుకోవాలని ప్రతిపాదించారు.



### మెగా డీఎస్సీ: కూటమి ప్రభుత్వంపై

# జగన్ మరోసారి ఫైర్

డీఎస్సీ పోస్టింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ అధినేత జగన్ ఆరోపణలు

65 మార్కుల నుంచి 77 మార్కులకు మారిన వైనంపై సందేహాలు

అర్హత లేని టెట్ పేపర్‌తో ఉద్యోగం ఇచ్చారని విమర్శ

ఈ స్కాంపై చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కాం జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపిస్తుండడం తెలిసిందే. దీనిపై ఆయన సోషల్ మీడియా వేదికగా మరోసారి ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా? అని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులతో, ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే, ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. విమర్శలు వెల్లువెత్తిన తర్వాత, ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే, డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్-×-ూకు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్-××-దీలో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు. 2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే, ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా? అని ప్రశ్నిస్తూ, దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.


### బ్రిక్స్ కూటమి మాత్రమే కాదు..

# పరిష్కారాల వ్యవస్థ



ఢిల్లీ:ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

బ్రిక్స్ ఒక కూటమి మాత్రమే కాదని, పరిష్కారాల వ్యవస్థ అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఢిల్లీలో ఆదివారం బ్రిక్స్ కూటమి చివరి రోజు సదస్సులో ఆయన మాట్లాడారు. కూటమిలో పాల్గొన్న బ్రిక్స్ దేశాల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి దార్శనికత, భవిష్యత్ సహకారానికి ఢిల్లీ డిక్లరేషన్ స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను నిర్ణీత కాలపరిమితిలో కార్యాచరణగా మార్చుతామని అన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. తాము తీసుకున్న నిర్ణయాలు పత్రాలకు మాత్రమే పరిమితం కావన్నారు. వాస్తవ జీవితంలో ప్రభావం చూపేలా పనిచేస్తామని మోదీ హామీ ఇచ్చారు. మరోవైపు బ్రిక్స్ దేశాల అధినేతలతో మోదీ వరుసగా భేటీ అవుతూ బిజీగా గడపనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, పరస్పర సహకారం వంటి అంశాలపై నేతలు చర్చించనున్నారు. కజకస్తాన్ అధ్యక్షుడు కాసిం జోమ్రాట్ తొకయెవ్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్.మార్కోస్, సౌతాఫ్రికా ప్రెసిడెంట్ సిరిల్ రమఫోసా, నైజీరియా ఉపాధ్యక్షుడు ఖాసిం షెట్టిమాతో మోదీ భేటీ కానున్నారు. కాగా.. ద్వైపాక్షిక చర్చలన్నీ భారత మండపంలో జరగనున్నాయి.



# మలేషియా పీఎంతో రాహుల్, ప్రియాంక బ్రేక్ ఫాస్ట్ భేటీ

ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు వేదికగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ (ఆదివారం) ఉదయం ఢిల్లీలోని ఒక హోటల్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఇచ్చిన ప్రత్యేక అల్పాహార విందులో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఈ భేటీ సందర్భంగా భారత్-మలేషియా సంబంధాలు, ఇరు దేశాల మధ్య దౌత్య బంధాలు, అంతర్జాతీయ/ప్రాంతీయ పరిణామాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. భేటీ అనంతరం మలేషియా ప్రధాని సామాజిక మాధ్యమం 'శ' వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీని తన 'మంచి మిత్రుడు' అని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులపై ఒకరి అభిప్రాయాలను మరొకరు పంచుకోవడానికి ఈ సమావేశం చక్కని వేదికైందని తెలిపారు. ఈ సమావేశానికి ఒక రోజు ముందే (శనివారం), ప్రధాని నరేంద్ర మోదీతో కూడా మలేషియా ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆ భేటీలో సెమీకండక్టర్లు, రక్షణ, వర్తకం, మౌలిక వసతులు, ఎనర్జీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై ఒప్పందాలు కుదిరాయి.

# హార్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకపై దాడి..

## ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణ ఇంకా కొనసాగుతూనే ఉంది. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా హార్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన జలసంధి పరిధిలోని క్వెష్మ్ ఐలాండ్ సమీపంలో ఆదివారం జరిగింది. క్వెష్మ్, హెంగామ్ ఐలాండ్ తీరంలో ఉదయం ఐదు గంటల సమయంలో ఈ దాడి జరిగిందని ఇరాన్ మీడియా వెల్లడించింది. బ్రిటన్‌కు చెందిన యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ కూడా ఈ విషయాన్ని నిర్ధరించింది. ఇరాన్ వాణిజ్య నౌకపై ఒక వస్తువుతో దాడి జరిగిందని ఈ సంస్థ తెలిపింది. అయితే, పూర్తి వివరాల్ని వెల్లడించలేదు. అమెరికా సైన్యం కూడా ఈ దాడిపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇరాన్ వాణిజ్య నౌకల్ని లక్ష్యంగా చేసుకుని ఇటీవల అమెరికా దాడులు నిర్వహిస్తోంది. హార్ముజ్ జలసంధిని అధీనంలో ఉంచుకోవడం, ఇరాన్ పోర్టుల్ని అడ్డుకోవడం వంటి చర్యల్లో భాగంగా ఇరాన్ ఈ పని చేస్తోంది. శనివారం రాత్రి హార్ముజ్ జలసంధిలోని క్వెష్మ్ ఐలాండ్‌లో అనేక దాడులు, పేలుళ్లు జరిగినట్లు సమాచారం. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తత ఇంకా కొనసాగుతూనే ఉంది. మరోవైపు హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచే అంశంపై ఒమన్‌లో గల్ఫ్ దేశాలతో ఇరాన్ చర్చలు జరుపుతోంది. ఈ జలసంధి నుంచే ప్రపంచంలో అత్యధిక వాణిజ్య నౌకలు రవాణా అవుతుంటాయి. అందువల్ల అంతర్జాతీయ చమురు రవాణాకు కూడా ఈ జలసంధి మార్గం కీలకం. ఈ జలసంధిపై అన్ని హక్కులు తమకే ఉన్నాయని ఇరాన్ చెబుతోంది.

# తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్..

## సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు

తెలంగాణలో మూడో
జాతీయ లోక్ అదాలత్
విజయవంతం
మొత్తం 1.51 లక్షలకు పైగా
క్రిమినల్ కేసులు పరిష్కారం
3,896 సైబర్ ఫ్రాడ్ కేసుల
సెటిల్‌మెంట్.. బాధితులకు
రూ.42.29 కోట్ల వాపసు
కేసుల పరిష్కారంలో హైదరాబాద్,
ఖమ్మం, గద్వాల యూనిట్లు టాప్
న్యాయవ్యవస్థ, పోలీసుల
సమన్వయంతో
కేసుల భారం తగ్గింపు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ.42.29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం.రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ.42.29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944 కేసులు), ఖమ్మం (10,955 కేసులు), గద్వాల (8,469 కేసులు), వరంగల్ (8,404 కేసులు), మల్కాజ్‌గిరి (8,109 కేసులు) ముందున్నాయి.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (ఁ+ూూా), జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు (ఙూూా), పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమష్టి కృషితో ఇంత పెద్ద సంఖ్యలో కేసు లను పరిష్కరించడం సాధ్యమైందని డీజీపీ తెలిపారు.

# నాగాలాండ్‌లో విషాదం..

## కల్తీ మద్యం సేవించి తొమ్మిది మంది మృతి

గువహాటి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13



రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి తొమ్మిది మంది మరణించారని నాగాలాండ్ డీజీపీ రుపిన్ శర్మ వెల్లడించారు. వీరంతా టుయెన్‌సాంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. కల్తీ మద్యం తాగి వీరంతా మరణించినట్లు నివేదిక అందడంతో రాష్ట్రవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు చెప్పారు. దీనిపై విచారణ జరుగుతోందన్నారు. మూన్, మోకోక్‌చుంగ్, టుయెన్‌సాంగ్, లాంగ్‌లెంగ్, కిఫైర్, షమాటోర్, నోక్లాక్ జిల్లాలోని ప్రజలెవరూ మద్యం సేవించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ పరిస్థితిపై స్పష్టత వచ్చే వరకు రాష్ట్రంలో ఇతర జిల్లాల్లోని ప్రజలు కూడా మద్యానికి దూరంగా ఉండాలని డీజీపీ రూపిన్ శర్మ కోరారు.అపరిచితులు లేదా అనధికారికంగా విక్రయించే మద్యాన్ని సేవించవద్దని ప్రజలను ఆయన హెచ్చరించారు. ఈ కల్తీ మద్యం ఎక్కడి నుంచి సరఫరా అయిందో గుర్తించేందుకు.. అందుకు కారణమైన వారిని పట్టుకునేందుకు పోలీసులు ఇప్పటికే దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. నాగాలాండ్‌లో 1989 టోటల్ లిక్కర్ ప్రొహిబిషన్ యాక్ట్ అమల్లో ఉంది. అయినా అక్రమ మద్యం మార్కెట్లతోపాటు కల్తీ మద్యం వ్యాపారం జోరుగా సాగడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.అస్సాంతో నాగాలాండ్‌కు ఉన్న సరిహద్దు ద్వారా అక్రమ మద్యం సరఫరా వెల్లువెత్తుతోంది. దాంతో నాగాలాండ్‌లోని సరిహద్దు పట్టణాల్లో మాఫియా ముఠాలు అక్రమ, కల్తీ మద్యం స్థావరాలు భారీగా ఏర్పాటు చేసుకున్నాయి. అవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల ఏటా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. అలాగే పర్యాటక, హోటల్, ఆతిథ్య రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరో వైపు అక్రమ రవాణా వల్ల మద్యం ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని యువత డ్రగ్స్ వైపు మళ్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# 'బ్రిక్స్' ప్రత్యేక విందుపై రాహుల్ చురకలు..

## సోషల్ మీడియాలో వైరల్




ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

ఢిల్లీలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఏర్పాటుచేసిన విందు కార్యక్రమం రాజకీయ చర్చకు తెరలేపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆతిథ్యమిచ్చిన ఈ విందులో పూర్తిగా శాకాహారమే వడ్డించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు మాంసాహారం తీసుకుంటారని ప్రస్తావిస్తూ.. భారతీయ నాన్‌వెజిటేరియన్ వంటకాలకూ అంతర్జాతీయ వేదికపై చోటు ఉండాల్సిందని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఆయన అభిప్రాయపడ్డారు. '80 శాతం మంది భారతీయులు మాంసాహారులు. భారతీయ నాన్‌వెజ్ వంటకాలు రుచిగా ఉంటాయి. అలాగే నా సోదరి చోలే భటూరే కూడా' అని తన వ్యాఖ్యకు సరదా టచ్ ఇస్తూ చోలే భటూరేను ప్రస్తావించారు రాహుల్. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.కాగా.. బ్రిక్స్ సదస్సు సందర్భంగా శనివారం రాత్రి ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధాని మోదీ విదేశీ నేతలు, ప్రతినిధుల కోసం గాలా డిన్నర్ ఏర్పాటు చేశారు. ఇందులో భారతీయ ప్రాంతీయ వంటకాల వైవిధ్యాన్ని పరిచయం చేసేలా ప్రత్యేక శాకాహార మెనూను రూపొందించారు. మొదటి వంటకాలుగా ఖాండ్వీ మిల్లే-ఫెయ్, ఖుంబ్ గలౌటీ వంటివి అందించారు. సంప్రదాయ భారతీయ వంటకాలకు ఆధునిక రూపునిచ్చి అంతర్జాతీయ అతిథులకు అందించడం ఈ మెనూ ప్రత్యేకతగా నిలిచింది.

# ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం మహిళల కొట్లాట

పరిగి-హైదరాబాద్ బస్సులో సీట్ల కోసం మహిళల తీవ్ర ఘర్షణ
సోషల్ మీడియాలో వైరల్ అయిన కొట్లాట వీడియో
ఈ ఘటనపై ఇంకా స్పందించని టీజీఎస్ఆర్టీసీ, పోలీసులు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పరిగి నుంచి హైదరాబాద్ వెళుతున్న టీజీఎస్ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొందరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని, పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఉచిత ప్రయాణ పథకం వల్ల బస్సుల్లో పెరిగిన రద్దీ, తలెత్తుతున్న వివాదాలపై మళ్లీ చర్చ మొదలైంది.వివరాల్లోకి వెళితే, వికారాబాద్ జిల్లా పరిగి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సులో ఈ గొడవ జరిగింది. వినాయక చవితి పండుగ నేపథ్యంలో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో సీటు విషయంలో నలుగురు మహిళల మధ్య వాగ్వాదం మొదలై, అది తీవ్ర ఘర్షణకు దారితీసింది. తోటి ప్రయాణికులు వారిని విడదీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ గొడవతో ఇబ్బందిపడిన కొందరు ప్రయాణికులు బస్సు దిగి వెళ్లిపోయినట్లు సమాచారం.తెలంగాణలో 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే, పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో తరచూ ఇలాంటి గొడవలు జరుగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. ఒక మంచి పథకాన్ని ఇలాంటి ఘటనలతో అపహాస్యం చేస్తున్నారని సోషల్ మీడియాలో పలువురు కామెంట్లు పెడుతున్నారు.

# మోటాకోండూర్ లో గణేష్ మండపాల నిర్వహకులతో పోలీసు శాఖ సమన్వయ సమావేశం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు13(ట్రైనెట్ న్యూస్):


యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో రెవెన్యూ మరియు విద్యుత్ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు మరియు గణేష్ పండగ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాము అని మోటకొండూరు ఎస్సై అన్నారు. ఈ కార్యక్రమానికి డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సిఐ శంకర్,తహసీల్దార్, విద్యుత్ శాఖ ఏఈ,మండల పరిధిలోని గ్రామాల సర్పంచులు మరియు నిర్వాహకులు హాజరయ్యారు. అధికారులు గణేష్ మండపాల నిర్వాహకులకు తగిన సూచనలు అందించారు.



# టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభం..

హైదరాబాద్:ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఁ×మీా)లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇవాళ (ఆదివారం) ఆస్పత్రికి చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు.వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై రాజనర్సింహ చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.



# ఆసియా కప్ జూనియర్ హాకీ

## : భారత మహిళల హ్యాట్రిక్ విజయం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు13

భారత మహిళల జూనియర్ హాకీ జట్టు అదరగొట్టింది. జూనియర్ ఆసియా కప్‌లో వరుసగా మూడోసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆతిథ్య చైనాను 1-0తో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. సానికా చంద్రకాంత్ మానే 17వ నిమిషంలో చేసిన ఏకైక గోల్ భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఈ విజయంతో భారత్ ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్ కప్‌కు కూడా అర్హత సాధించింది.

### సానికా గోల్‌తో ఆధిక్యం

భారత్, చైనా మధ్య ఫైనల్ హోరాహోరీగా సాగింది. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. రెండో క్వార్టర్‌లో 17వ నిమిషంలో సానికా మానే అద్భుతంగా గోల్ చేసి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా భారత అమ్మాయిలు డిఫెన్స్‌లో ఏమాత్రం తడబడలేదు. మూడో క్వార్టర్‌లోనూ ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత్.. చివరి క్వార్టర్‌లోనూ ఆతిథ్య జట్టుకు అవకాశం ఇవ్వలేదు. చివరి విజిల్ వరకు పట్టుదలగా పోరాడి 1-0 విజయాన్ని అందుకుంది.

### ప్లేయర్లకు నజరానా

జూనియర్ ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకున్న భారత మహిళల జట్టుకు హాకీ ఇండియా నగదు బహుమతిని ప్రకటించింది. ప్రతి ప్లేయర్‌కు రూ.3 లక్షలు, సహాయక సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ.1.5 లక్షలు అందించనున్నట్లు వెల్లడించింది.



edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136